E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 29-01-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక: 29 || పేజీలు–6 www.ekaburu.com




అమెజాన్‌లో 16వేల మంది
**ఉద్యోగులు తొలగింపు**
» 4లో

### తెలంగాణ రైజింగ్ విజన్‌కు
## సహకరించండి



- కెనడీ స్కూల్ ప్రొఫెసర్లను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- సానుకూలంగా స్పందించిన ఇద్దరు ప్రొఫెసర్లు

**ఈ-కబురు, హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ విజన్'కు సహకరించాలని కెనడీ స్కూల్ ప్రొఫెసర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ పరిఉధిలోని కెనడీ స్కూల్‌లో ప్రత్యేక కోర్సు చదువుతున్న రేవంత్‌రెడ్డి.. అక్కడ ఇద్దరు ప్రొఫెసర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు. వైస్ ప్రోవోస్ట్-హెడ్ ఆఫ్ హార్వర్డ్ ఎక్స్ డస్టిన్ టింగ్లీ, కెనడీ స్కూల్ డీన్ జెర్మీ విన్‌స్టిన్‌తో భేటీ అయ్యారు.**

తరువాయి 2లో

# విమాన ప్రమాదంలో...
# అజిత్ పవార్ దుర్మరణం




- బారామతి విమానాశ్రయం వద్ద ఘటన
- రన్‌వే దగ్గర్లోనే కుప్పకూలిన విమానం
- మంటలు చెలరేగి పేలిపోయిన వైనం
- అజిత్‌తో పాటు మరో నలుగురి మృతి
- మృతుల్లో పైలట్లు, భద్రతాధికారి, అటెండెంట్
- శోకసంద్రంలో మహారాష్ట్ర
- నేడు బారామతిలో అంత్యక్రియలు
- ప్రధాని, పలువురు నేతల సంతాపం
- విచారణకు విపక్ష నేతల డిమాండ్

ఈకబురు, బారామతి/ముంబై/న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ (66) విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. పుణె జిల్లా లోని పవార్ స్వస్థలమైన బారామతిలో బుధవారం ఉదయం విమానాశ్రయంలో దిగేందుకు కొద్ది క్షణాల ముందు రన్‌వేకు కేవలం 100 అడుగుల దూరంలో ఈ దారుణం జరిగింది. రన్‌వే కన్పించకపోవడంతో మరో రౌండ్ చుట్టి తిరిగి వచ్చే క్రమంలో విమానం అదుపు తప్పింది. క్షణాల వ్యవధిలోనే శరవేగంగా కింద పడిపోయింది. నేలను ఢీకొట్టగానే మంటలు చెలరేగి పేలిపోయింది. ప్రమాద తీవ్రత ధాటికి రెండు ముక్కలైంది. దాంతో పవార్‌తో పాటు విమానంలోని మరో నలుగురు కూడా అక్కడికక్కడే మరణించారు. మృతుల్లో పైలట్ కెప్టెన్ సుమిత్ కపూర్, కో పైలట్ కెప్టెన్ శాంభవీ పాఠక్, పవార్ వ్యక్తిగత భద్రతాధికారి విదీప్ జాదవ్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలీ ఉన్నారు. ప్రమాదం జరిగిన కాసేపటికే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. అప్పటికే అజిత్‌తో పాటు అందరూ ప్రాణాలు కోల్పోయారు. అజిత్‌ను ఆయన కళ్లద్దాలు, చేతి వాచీ సాయంతో గుర్తించారు. ఆయనతో పాటు మిగతా నలుగురి మృతదేహాలను బారామతి ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలియగానే అజిత్ కుటుంబీకులతో పాటు ఆయన పార్టీ ఎన్సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. వారి శోకంతో ఆ పరిసరాల్లో విషాదం నెలకొంది.

తరువాయి 2లో

3లో »
విమానయానరంగానికి కోపైలట్‌గా ఉండండి



## దేశమే గొప్ప..
### ఎంపీలంతా ఏకమవ్వాలి

- వికసిత్ భారత్ లక్ష్యంగా కలిసి పనిచేయాలి : రాష్ట్రపతి
- పార్లమెంటులో ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన ముర్ము

**ఈ-కబురు న్యూఢిల్లీ, జనవరి 28: వికసిత్ భారత్ లక్ష్యంగా పార్లమెంటు సభ్యులందరూ ఏకతాటిపై నిలిచి పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. విభేదాలకు అతీతంగా స్వదేశీ వస్తువుల వినియోగం, దేశ భద్రత వంటి అంశాల్లో కలిసి పనిచేయాలని కోరారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఆమె ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు.**



తరువాయి2లో

## సీఎంకు పాలన చేతగాక..
## తప్పించుకునే యత్నం!

- మునిసిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలి
- ఆదూరి రమేశ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కేటీఆర్



ఈకబురు హైదరాబాద్, జనవరి 28 : రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగాక అప్పుల పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కేంద్రం, ఆర్బీఐ, కాగ్‌లు నామమాత్రపు రుణాలున్నాయని చెబుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పుల సంఖ్య పెంచి తప్పుడు లెక్కలు చూపుతోందని ఆరోపించారు.

తరువాయి 2లో

## బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు

- ఆ పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేయలేదు.. నేను కాంగ్రెస్‌లో చేరానని బీఆర్ఎస్ భావన
- నాపై దాఖలైన అనర్హత పిటిషన్ చెల్లదు
- స్పీకర్‌కు దానం నాగేందర్ అఫిడవిట్
- 30న విచారణకు రావాలని స్పీకర్ నోటీసు



**ఈ-కబురు హైదరాబాద్, : తాను బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, తనను సస్పెండ్ చేసినట్లుగా ఆ పార్టీ నుంచి ఎలాంటి సమాచారమూ అందలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు తెలిపారు. తాను 2024 మార్చిలో కాంగ్రెస్ నిర్వహించిన ఓ సమావేశానికి వ్యక్తిగత హోదాలో మాత్రమే వెళ్లానని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లుగా బీఆర్ఎస్ భావిస్తోందన్నారు.**

తరువాయి 2లో



### పురపోరులో సింహం గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ

**ఈ-కబురు తెలంగాణలోని పురపాలక సంఘాల్లో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఇంకా రాజకీయ పార్టీగా ఏర్పడకపోవడంతో తెలంగాణ జాగృతి అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ)కు చెందిన సింహం గుర్తుపై పోటీచేయాలని నిర్ణయించుకున్నారు.**

2లో »

# గద్దెపైకి సారలమ్మ

- ఉదయం నుంచి సారలమ్మ గుడిలో పూజలు
- సాయంత్రం బయలుదేరిన కన్నెపల్లి కల్పవల్లి
- అడుగడుగునా భక్తుల నీరాజనం.. కన్నెపల్లి నుంచి మేడారం దాకా 2 కి.మీ. మేర బారులు
- డోలు వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు
- శిగమూగిన వేలాది మంది మహిళలు
- నేడే గద్దెపైకి సమ్మక్క తల్లి.. పూర్తైన ఏర్పాట్లు
- జంపన్నవాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి



ఈకబురు మేడారం, జనవరి 28 : లక్షలాది మంది భక్తులు నిలువెల్లా కనులై ఎదురుచూస్తున్న సారలమ్మ బుధవారం ఆదివాసీ సంప్రదాయాల మధ్య అట్టహాసంగా మేడారంలోని గద్దెపైకి చేరుకుంది. దీనితో మహా జాతర తొలి ఘట్టం ప్రశాంతంగా పూర్తయినట్టయింది. కన్నెపల్లిలోని గుడి నుంచి సారలమ్మ బుధవారం రాత్రి 7.38 గంటలకు బయలు దేరింది. జంపన్నవాగు వద్దకు 8.48 గంటలకు చేరుకున్నది. అక్కడి నుంచి అశేష భక్తజనం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి మేడారంలోని గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మను పూజారులు మేడారంలోని గద్దెకు తరలించే ఘట్టం భక్తులను దివ్యానుభూతికి లోను చేసింది. ఈ ప్రక్రియ బుధవారం ఉదయం నుంచే మొదలైంది. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని పూజారుల కుటుంబ సభ్యులు తొలుత శుద్ధి చేశారు. గుడి లోపల, బయట అలికి ముగ్గులు వేసి మామిడి తోరణాలు, బంతి పూలతో అందంగా అలంకరించారు. సాయంత్రం అసలైన పూజాతంతు మొదలైంది. పూజా మందిరంలో ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు ఇతర వడ్డెలు రహస్య పూజలు చేశారు. లోపల పూజలు జరుగుతున్నంత సేపూ గుడి బయట ఆదివాసీ కళాకారులు డోలు వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. సారలమ్మను కీర్తిస్తూ పాటలు పాడారు. శివసత్తులు శిగమూగారు. మరోవైపు..

తరువాయి 3లో

## ఎలాంటి ఎజెండా లేకుండానే..

- రేపు జల వివాదాల కమిటీ తొలి భేటీకి హాజరుకానున్న తెలంగాణ
- ఏపీ నల్లమలసాగర్‌ను ప్రస్తావిస్తే వ్యతిరేకించాలని నిర్ణయం
- ఫైవ్ పాయింట్ ఎజెండాను ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్
- తెలంగాణలోని ప్రాజెక్టులే ప్రధానాంశాలు



ఈకబురు హైదరాబాద్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన జరగనున్న ఉభయ రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ తొలి సమావేశానికి ఎలాంటి ఎజెండా లేకుండానే వెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల సీడబ్ల్యూసీ ఏర్పాటు చేసిన ఈ కమిటీ ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని సీడబ్ల్యూసీ సమావేశ మందిరంలో భేటీ కానుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీలోగా సంబంధిత అంశాలతో ఎజెండాను పంపించాలని రెండు రాష్ట్రాలను కేంద్రం కోరింది. అయితే కమిటీ తదుపరి సమావేశాల్లో చర్చించాల్సిన, చర్చించకూడని అంశాలపై తొలి సమావేశంలో చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు శాశ్వత ఎజెండాను ఖరారు చేసేలా 30వ తేదీన కేంద్రాన్ని కోరాలని నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఏపీ మాత్రం ఐదు అంశాలతో కూడిన ఎజెండాను కేంద్రానికి ప్రతిపాదించినట్టు తెలిసింది.

**తెలంగాణ ప్రాజెక్టులే ఏపీ ఎజెండా**

తెలంగాణలోని ప్రాజెక్టులను లక్ష్యంగా చేసుకుని ఏపీ ఎజెండాను ప్రతిపాదించింది. రాష్ట్ర విభజనకు ముందు తెలంగాణలోని ప్రాజెక్టుల వారీగా 940.87 టీఎంసీల నీటిని వినియోగించుకోవడానికి సీడబ్ల్యూసీలోని వివిధ డైరెక్టరేట్లతో పాటు టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) ఇచ్చిన అనుమతుల పత్రాలు అందజేయాలని కోరనుంది.

తరువాయి 2లో

# ఎలాంటి ఎజెండా లేకుండానే..



రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతుల పత్రాలనూ ఇవ్వాలని విజ్ఞప్తి చేయనుంది. ఇక సీడబ్ల్యూసీ అనుమతులు లేకుండా కృష్ణా పరీవాహకంలో తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టుల వివరాలు, వాటిని అడ్డుకోవడానికి తీసుకున్న చర్యలను వివరించాలని కోరనుంది. కృష్ణా/గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఇరు రాష్ట్రాలకు ఉన్న వాటాలపై స్పష్టత ఇవ్వాలని కోరడంతో పాటు పోలవరం–నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు జారీ చేయాలని విజ్ఞప్తి చేయనుంది.

అయితే పోలవరం–బనకచర్ల/నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. 30న భేటీలో ఈ అంశాన్ని ఏపీ ప్రతిపాదిస్తే తీవ్రంగా వ్యతిరేకించాలని తాజాగా నిర్ణయించినట్టు తెలిసింది.

## సీఎంకు పాలన చేతగాక.. తప్పించుకునే యత్నం!



మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీజేపీకి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ప్రతి పైసా అప్పును సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించిందని గుర్తుచేశారు. కానీ, రేవంత్‌రెడ్డి రెండేళ్లలో తెచ్చిన రూ.2.50 లక్షల కోట్ల అప్పుతో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ సర్కారు పాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడాలని, రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రమేశ్ గతంలో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారని, దాదాపు లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచిన ఆయన 16 ఓట్ల తేడాతో ఓడిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పార్టీలో అందరినీ కలుపుకొని ముందుకెళ్లి, మునిసిపల్ ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించాలని రమేశ్‌ను కోరారు.

## పురపోరులో సింహం గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ



ఈమేరకు బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కవితతో ఏఐఎఫ్‌బీ పార్టీ ప్రతినిధులు భేటీ అయ్యారు. మునిసిపల్ ఎన్నికల్లో జాగృతి మద్దతుదారులు సింహం గుర్తుతో పోటీచేయాలని, ఇందుకు తమ సహకారం ఉంటుందని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు జావెద్ లతీఫ్, ఉపాధ్యక్షులు కె.బుచ్చిరెడ్డి, తదితరులు ప్రకటించారు. మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆటో డ్రైవర్లకు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. వివిధ ఆటో యూనియన్‌ల నాయకులతో సమావేశమైన ఆమె.. హైదరాబాద్‌లో ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఆటో డ్రైవర్లపై జరుగుతున్న దాడులు, వేధింపులపై ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేల సాయాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని, అవసరమైతే కార్మికశాఖ మంత్రిని కలుస్తామన్నారు.

## విమాన ప్రమాదంలో...
# అజిత్ పవార్ దుర్మరణం



మహారాష్ట్ర అంతటా విషాద ఛాయలు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మొదలుకుని పలువురు నేతలు తదితరులు దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. పార్టీలకు అతీతంగా సంతాపం తెలిపారు. మహారాష్ట్ర ఒక గొప్ప నేతను కోల్పోయిందంటూ ఆవేదన వెలిబుచ్చారు. అజిత్ అంత్యక్రియలు ఆయన రాజకీయ కర్మభూమి అయిన బారామతిలో గురువారం ఉదయం పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరగనున్నాయి. మోదీ, అమిత్ షా తదితరులు పాల్గొనే అవకాశముంది. మహా రాష్ట్ర ప్రభుత్వం జనవరి 30 దాకా మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హుటాహుటిన బారామతి చేరు కుని అజిత్ కుటుంబీకులను ఓదార్చారు. ''జరిగింది నమ్మశక్యం కాని ఘోరం. మంచి మిత్రున్ని కోల్పోయాను''అంటూ ఆవేదన వెలిబుచ్చారు. అజిత్ మృతితో తాను పెద్దన్నయ్యను కోల్పోయానంటూ ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా కన్నీటిపర్యంతమయ్యారు. ఆయన మరణం మహారాష్ట్రకు తీరని లోటన్నారు. అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ రాజ్యసభ సభ్యురాలు. వారికి కుమారులు పార్థ్, జై ఉన్నారు. 66 ఏళ్ల అజిత్ మృతితో మహారాష్ట్రలో బీజేపీ సారథ్యంలోని మహాయుతి అధికార కూటమిలో భారీ శూన్యమే ఏర్పడింది. అంతేగాక ఆయన సారథ్యంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ భవితవ్యంపైనా నీలినీడలు కమ్ముకున్నాయి.

**ఆ చివరి క్షణాలు...**

జిల్లా పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పుణెలో నాలుగు ప్రచార ర్యాలీల్లో పాల్గొనే నిమిత్తం అజిత్ పవార్ బుధవారం ఉదయం ముంబై నుంచి విమానంలో బారామతి బయల్దేరారు. అది వీఎస్ఆర్ వెంచర్స్ అనే ప్రైవేట్ సంస్థకు చెందిన 9 సీట్ల సామర్థ్యమున్న చిన్న లియర్‌జెట్-45 మోడల్ విమానం. ప్రమాదం జరిగిన తీరును పౌర విమానయాన శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ''విమానం ఉదయం 8.10 గంటలకు ముంబై విమానాశ్రయం నుంచి బయల్దేరింది. 8.18కి విమానం బారామతి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) పరిధిలోకి వచ్చింది. గాలి తీవ్రత ఏమీ లేదని, 3 కి.మీ. దాకా స్పష్టమైన విజిబిలిటీ ఉందని పైలట్‌కు ఏటీసీ సిబ్బంది తెలిపారు. 8.40కల్లా విమానం బారామతి విమానాశ్రయాన్ని సమీపించి లాండింగ్‌కు సిద్ధమైంది. బారామతి విమానాశ్రయం 'అన్‌కంట్రోల్డ్ ఎయిర్‌ఫీల్డ్'. ఇలాంటి విమానాశ్రయాల్లో ఏటీసీ టవర్ ఉండదు. దాంతో దృశ్యమానత తదితరాల ఆధారంగా పైలట్లే తమ విచక్షణ మేరకు లాండింగ్ చేస్తారు. వారికి ఎయిర్ ట్రాఫిక్ సమాచారాన్ని అందజేయడంలో స్థానిక విమానయాన శిక్షణ సంస్థల పైలట్లు, ఇన్‌స్ట్రక్టర్లు సాయపడుతూ ఉంటారు. 8.40 గంటలకు రన్‌వే 11పై విమానం లాండింగ్‌కు ఏటీసీ అనుమతించింది. గాలి వేగం, దృశ్యమానత (విజిబిలిటీ) ఎలా ఉన్నాయని ఏటీసీ ఆరా తీయగా రన్‌వే కన్పించడం లేదని పైలట్ చెప్పారు. లాండింగ్ ప్రయత్నం మానుకుని 'గో అరౌండ్'ప్రక్రియను అనుసరించి విమానం గాల్లోనే మరో రౌండ్ తిరిగింది. ఆ తర్వాత కూడా రన్‌వే కన్పించడం లేదని పైలట్ తెలిపారు. అది కన్పించాక కాల్ చేస్తామని చెప్పారు. తర్వాత కొద్ది సెకన్లకే రన్‌వే కనిపిస్తున్నట్టు చెప్పారు. దాంతో ఉదయం 8.43 గంటలకు రన్‌వే 11పై లాండింగ్‌కు ఏటీసీ అనుమతించింది. కానీ ఏటీసీ లాండింగ్ సందేశానికి విమాన సిబ్బంది నుంచి 'రీడ్‌బ్యాక్'ఏమీ రాలేదు. ఏటీసీ సందేశాన్ని పైలట్/కో పైలట్ తిరిగి విన్పించడమే రీడ్‌బ్యాక్. తర్వాత కాసేపటికే, అంటే 8.44 గంటలకు విమానం రన్‌వే కొసకు ఎడమవైపున కుప్పకూలి మంటల్లో చిక్కింది. దాంతో హుటాహుటిన ఎమర్జెన్సీ సర్వీసులను ఘటనా స్థలికి తరలించారు. కానీ అప్పటికే ఘోరం జరిగిపోయింది. అజిత్‌తో పాటు విమానంలోని వారంతా దుర్మరణం పాలయ్యారు''అని ప్రకటన పేర్కొంది. విమానం నేరుగా నేలపై బండరాయిని ఢీకొట్టినట్టు చెబుతున్నారు. అందుకే ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉందని సమాచారం. ప్రమాదానికి ముందు ఆపదలో ఉన్నట్టు తెలిపే 'మే డే'కాల్ ఏదీ పైలట్ నుంచి రాలేదని డీజీసీఏ స్పష్టం చేసింది.

**అటూ ఇటూ ఊగింది ప్రత్యక్ష సాక్షులు**

విమానం కుప్పకూలేందుకు కొద్దిసేపటి ముందు అదుపు కోల్పోయినట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. విమానాశ్రయాన్ని సమీపించి కిందిదాకా వచ్చిన అనంతరం లాండ్ అవడానికి బదులుగా విమానం మరోసారి రౌండ్ కొట్టిందని ఒక మహిళ తెలిపారు. ''ఆ వెంటనే విమానం అటూ ఇటూ ఊగుతూ వేగంగా కిందివైపు దూసుకొచ్చింది. అదే ఊపులో నేలను తాకి పేలిపోయింది''అని ఆమె చెప్పుకొచ్చారు. పేలుడు శబ్దాలు సుదూరాల దాకా వినిపించాయన్నారు. పేలుడు తీవ్రతకు విమాన శకలాలు గాల్లో సుదూరాల దాకా ఎగిరి సమీపంలోని నివాస ప్రాంతాల వద్ద పడ్డట్టు మరికొందరు తెలిపారు. విమానం కుప్పకూలాక వరుసగా నాలుగైదు పేలుళ్లు విన్పించినట్టు వివరించారు. తర్వాత కాసేపటికి దగ్గరికి వెళ్లి మృతులను గుర్తించి అంబులెన్సుల్లోకి చేర్చినట్టు వారు చెప్పారు. తర్వాత కాసేపటికే అగ్నిమాపక శకటాలు అక్కడికి చేరుకున్నాయి. అజిత్‌తో పాటు విమానంలోని ఐదుగురినీ వెంటనే ఆస్పత్రికి తరలించినట్టు ఎస్పీ సందీప్‌సింగ్ గిల్ చెప్పారు.





## తెలంగాణ రైజింగ్ విజన్‌కు సహకరించండి



మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ విజన్' గురించి వారికి సీఎం వివరించారు. అనంతరం రైజింగ్ విజన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకున్న అవకాశాలపైనా చర్చించారు. అనంతరం సీఎం రేవంత్ ప్రతిపాదన పట్ల ఇద్దరు ప్రొఫెసర్లు సానుకూలంగా స్పందించారు. అలాగే విద్యలో మార్పులు, నాణ్యమైన విద్య, ఆధునిక నైపుణ్య శిక్షణ, అభివృద్ధి, ఆర్థిక వృద్ధికి సంబంఉధించిన అంశాలపై చర్చించినట్టు సీఎం కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

## బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు



ఈ మేరకు ఆదివారం స్పీకర్‌కు అఫిడవిట్ ఇచ్చారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌లో లేవనెత్తిన అంశాల వారీగా అఫిడవిట్‌లో వివరణ ఇచ్చిన దానం నాగేందర్.. గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం తనపై దాఖలైన పిటిషన్‌లో చూపిన ఏ కారణమూ చెల్లబోదన్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అనర్హత పిటిషన్‌లోని అంశాలపైన మాత్రమే తాను వివరణ ఇస్తున్నానని, పిటిషన్ తర్వాతి పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దంటూ స్పీకర్‌ను కోరారు. దానం నాగేందర్ అఫిడవిట్‌ను పరిశీలించిన స్పీకర్ ఈ నెల 30న అనర్హత పిటిషన్‌పై విచారణకు రావాలని నోటీసులిచ్చారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై 30న స్పీకర్ విచారణ చేపడుతున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు కౌశిక్ రెడ్డి పిటిషన్, మధ్యాహ్నం 12 గంటలకు మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాదుల వాదనలను స్పీకర్ వింటారు.

సుప్రీం సూచనతో విచారణ వేగిరం..

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి సహా పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు విడివిడిగా పిటిషన్లు వేశారు. సుప్రీం కోర్టు సూచన మేరకు విచారణ జరిపిన స్పీకర్ ప్రసాద్‌కుమార్.. అందులో ఏడుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపై తీర్పు ఇచ్చారు. వారు పార్టీ మారినట్లు

## దేశమే గొప్ప..
# ఎంపీలంతా ఏకమవ్వాలి



. 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విభిన్న అభిప్రాయాలు, వేర్వేరు దృక్కోణాలు ఉన్నప్పటికీ దేశం విషయంలో మాత్రం అంతా ఏకమవ్వాలని.. దేశం కంటే గొప్పదేమీ లేదని ముర్ము చెప్పారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమని.. కొన్ని అంశాల్లో మాత్రం వాటికి తావుండకూడదని, ఇదే విషయాన్ని మహాత్మా గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్, వల్లభాయ్ పటేల్, జయప్రకాశ్ నారాయణ్, రామ్‌మనోహర్ లోహియా, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వాజ్‌పేయిలూ విశ్వసించారని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల విషయంలో ఎంపీలందరూ ఐక్యంగా నిలబడాలన్నారు. కాగా రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత లోక్‌సభ, రాజ్యసభల్లో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇక రాష్ట్రపతి ప్రసంగంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఆమె ప్రసంగం నిస్సారంగా ఉందని ఆరోపించింది.

## నరేగా, సర్‌లపై పార్లమెంటులో నిరసనలకు విపక్షాల నిర్ణయం


ఈకబురు దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (ఎంజీనరేగా) రద్దు, ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్)లపై పార్లమెంటులో లేవనెత్తి నిరసనలు తెలపాలని విపక్షాలు నిర్ణయించాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై, కేంద్ర బడ్జెట్‌పై జరిగే చర్చలో ఈ అంశాలపై గళమెత్తాలని తీర్మానించాయి. ఇండియా కూటమిలోని వివిధ విపక్షాలకు చెందిన నేతలు బుధవారం రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే ఛాంబర్లో సమావేశమయ్యారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చించారు. బడ్జెట్ సమర్పణ సమయంలోనూ నిరసనలు కొనసాగించాలని నిర్ణయించారు. లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీతో పాటు టి.ఆర్.బాలు (డీఎంకే), అరవింద్ సావంత్ (శివసేన యూబీటీ), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), ఎన్.కె. ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ), జావెద్ అలీఖాన్ (సమాజ్‌వాదీ), ప్రేమ్‌చంద్ గుప్తా (ఆర్జేడీ), పి.సందోష్ (సీపీఐ) తదితరులు దీనిలో పాల్గొన్నారు. తృణమూల్, ఆప్ నేతలు హాజరుకాలేదు. ఎంజీనరేగాను పునరుద్ధరించాల్సిందిగా డిమాండ్ చేయడానికి ప్రజాస్వామ్యయుత విధానాలన్నింటినీ వాడుకుంటామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా తెలిపారు.



# గద్దెపైకి సారలమ్మ







ఈకబురు మేడారం, జనవరి 28 : లక్షలాది మంది భక్తులు నిలువెల్లా కనులై ఎదురుచూస్తున్న సారలమ్మ బుధవారం ఆదివాసీ సంప్రదాయాల మధ్య అట్టహాసంగా మేడారంలోని గద్దెపైకి చేరుకుంది. దీనితో మహా జాతర తొలిఘట్టం ప్రశాంతంగా పూర్తయినట్టయింది. కన్నెపల్లిలోని గుడి నుంచి సారలమ్మ బుధవారం రాత్రి 7.38 గంటలకు బయలు దేరింది. జంపన్నవాగు వద్దకు 8.48 గంటలకు చేరుకున్నది. అక్కడి నుంచి అశేష భక్త జనం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి మేడారం లోని గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మను పూజారులు మేడారంలోని గద్దెకు తరలించే ఘట్టం భక్తులను దివ్యానుభూతికి లోను చేసింది. ఈ ప్రక్రియ బుధవారం ఉదయం నుంచే మొదలైంది. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని పూజారుల కుటుంబ సభ్యులు తొలుత శుద్ధి చేశారు. గుడి లోపల, బయట అలికి ముగ్గులు వేసి మామిడి తోరణాలు, బంతి పూలతో అందంగా అలంకరించారు. సాయంత్రం అసలైన పూజాతంతు మొదలైంది. పూజా మందిరంలో ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు ఇతర వడ్డెలు రహస్య పూజలు చేశారు. లోపల పూజలు జరుగుతున్నంతసేపూ గుడి బయట ఆదివాసీ కళాకారులు డోలు వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. సారలమ్మను కీర్తిస్తూ పాటలు పాడారు. శివసత్తులు శిగమూగారు. మరోవైపు.. సారలమ్మ రాకను కళ్లారా చూడాలన్న తపనతో వేలాదిగా భక్తులు ఉదయం నుంచే పెద్దసంఖ్యలో కన్నెపల్లికి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల వరకూ గుడి లోపల పూజలు జరిగాయి. పూజారి కాక సారయ్య.. సారలమ్మ ప్రతి రూపమైన కుంకుమ భరిణను తీసుకొని బయలుదేరుతున్న సంకేతం అందగానే అప్పటి వరకు గుడి బయట వేచివున్న వేలాది భక్త జనం శిగమూగారు. సంతానం లేనివారు పిల్లల కోసం వరాలు పట్టారు. గుడిలో హారతి ఇచ్చి గంటానాథం, బూరకొమ్ము ధ్వనితో మహిళలు గుడి ముందర తడిబట్టలతో సాగిలపడ్డారు.

దారి పొడవునా నీరాజనాలు

పూజారి సారయ్య సారలమ్మ తల్లి రూపాన్ని తలకెత్తుకొని గుడిబయట అడుగు పెట్టగానే భక్తుల కేరింతలతో తల్లికి స్వాగతం పలికారు. అద్వితీయమైన అనుభూతితో నిలువెల్లా పులకించిపోయారు. దారికి అడ్డంగా పడుకున్న మహిళల పై పసుపు కుంకుమలు, అక్షింతలు, శుద్ధ జలాన్ని చల్లుతూ వారిని దాటుకుంటూ సారయ్య.. తల్లితో ముందుకు సాగారు. సారలమ్మ తల్లి రూపాన్ని తాకాలన్న తపనతో వడ్డెల వద్దకు చేరుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ముందుకు చొచ్చుకువచ్చారు. అయితే.. రోప్ పార్టీలు వడ్డెలకు రక్షణ వలయంగా నిలబడి దారి కల్పించారు. భక్తులు చొచ్చుకు రాకుండా అడ్డుగా నిలిచారు. సారలమ్మ మేడారంవైపు సాగివస్తుండగా.. కన్నెపల్లి గ్రామస్థులు ఎదురెళ్లి హారతులు ఇచ్చారు. తమ ఇళ్ల ముందు నిల్చొని స్వాగతం పలికారు. మహిళలే తల్లి ప్రయాణించే మార్గంలో అడుగడుగునా నీళ్లారబోశారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. మొక్కులను సమర్పించుకున్నారు. ''సారలమ్మ తల్లీ.. మమ్మల్ని చల్లంగ చూడ''ంటూ వేడుకున్నారు. కన్నెపల్లి నుంచి మేడారం వరకు 2 కిలోమీటర్ల మేర దారి పొడవునా భక్తులు బారులుతీరి నిల్చున్నారు. తల్లికి అడుగడుగునా నీరాజనాలు పలికారు.

జంపన్నవాగు వద్ద పూజలు

కన్నెపల్లి నుంచి జంపన్నవాగు వద్దకు వచ్చిన తర్వాత వాగు ఒడ్డున కొద్దిసేపు తల్లికి జంపన్న తరఫున ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంపన్నవాగు దాటుతుండగా భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. వాగుకు ఇటువైపున ఒడ్డుపై ప్రతిష్ఠితమైన నాగులమ్మ వద్ద కూడా పూజారులు కొద్దిసేపు ఆగారు. అక్కడ కూడా నాగులమ్మ పక్షాన సారలమ్మకు పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అక్కడి నుంచి మేడారంలోని సమ్మక్క గుడికి సారలమ్మను తీసుకువచ్చారు. అప్పటికే మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి చేరిన పగిడిద్దరాజుతో పాటు గోవిందరాజుతో సహా సమ్మక్క గుడిలో సారలమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పగిడిద్దరాజుకు, సమ్మక్కకు కల్యాణం తంతు నిర్వహించారు. ఇది పూర్తయిన తర్వాత గోవిందరాజు, పగిడిద్దరాజు తోడు రాగా, సారలమ్మను మేడారం గద్దె వద్దకు పూజారులు చేర్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం అమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. అదే ప్రాంగణంలో ఒకవైపు గోవిందరాజును, మరోవైపు పగిడిద్దరాజును వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెలపైకి చేర్చారు. దీనితో మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర తొలిఘట్టం దిగ్విజయంగా ముగిసినట్లయింది. పోలీసులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. సారలమ్మ రాక సందర్భంగా గద్దెల వద్ద భక్తులు పోటెత్తారు. సారలమ్మను, గోవిందరాజు, పగిడిద్దరాజును ఏకకాలంలో దర్శించుకొని తన్మయత్వానికి లోనయ్యారు. ఈ ముగ్గురు దేవతల రాకతో సమ్మక్క ఆగమనానికి సంకేతం లభించినట్లయింది. గతంలో కన్నా భిన్నంగా గద్దెల ఆధునికీకరణలో భాగంగా సమ్మక్కతో పాటు సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను ఒకదాని వెనుక ఒకటిగా నిర్మించడంతో భక్తులకు దర్శనం సులువైంది.

జంపన్నవాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర తొలిరోజే జంపన్నవాగులో విషాదం చోటు చేసుకుంది. జాతర కోసం సంతోషంగా వచ్చిన ఓ కుటుంబానికి కన్నీరే మిగిలింది. జంపన్నవాగులో పుణ్యస్నానం కోసం వెళ్లిన కిరణ్(45) అనే భక్తుడు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. మత్స్యశాఖ అధికారులు, రెస్క్యూ టీం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఆర్.కిరణ్ తన కుటుంబ సభ్యులతో మంగళవారం మేడారం జాతరకు వచ్చారు. చిలుకలగుట్ట ప్రాంతంలో ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. బుధవారం సాయంత్రం సారలమ్మ వస్తోందని తెలిసి జంపన్నవాగులో కుటుంబ సభ్యులతో కలిసి పుణ్య స్నానాలకు వెళ్లారు. జంపన్నవాగు మధ్యలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని తెలియక ఆయన లోపలికి వెళ్లి.. వాగు ఉధృతికి కొట్టుకుపోయారు. అక్కడున్న కొందరు యువకులు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. గల్లంతైన కిరణ్ కోసం రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లు గాలించగా.. అక్కడికి చాలా దూరంలో ఆయన మృతదేహం కనిపించింది. సంతోషంగా జాతరకు వచ్చిన ఆ కుటుంబం కిరణ్ మృతితో కన్నీరుమున్నీరైంది. ఈ నేపథ్యంలో.. జంపన్నవాగులో స్నానాలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కోళ్లకు వైరస్ దెబ్బ

మేడారం మహా జాతరలో కోళ్లకు వైరస్ దెబ్బ తగిలింది. జాతర ప్రారంభమైన బుధవారం రోజున పలు షాపుల్లో వేల సంఖ్యలో బ్రాయిలర్, నాటు కోళ్లు మృతి చెందాయి. మృతి చెందిన కోళ్లను ట్రాక్టర్లలో అడవికి తరలించి ఖననం చేశారు. మొదటిరోజే పెద్ద సంఖ్యలో కోళ్లు మృతి చెందడంతో వ్యాపారులకు భారీ నష్టం వాటిల్లింది. వైరస్ దెబ్బకు మరింత నష్టం జరుగుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. అనారోగ్యం బారిన పడిన కోళ్లను సరఫరా చేస్తున్న హోల్‌సేల్ వ్యాపారులపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

సమ్మక్క తల్లి రాకకు ఏర్పాట్లు పూర్తి..

కోట్లాది మంది ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్న వనదేవత సమ్మక్క గురువారం మేడారంలోని గద్దెపైకి రానున్నది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. సమ్మక్క రాకతో మేడారం మహా జాతర శిఖరాగ్ర స్థాయికి చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఏర్పాట్లపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) బుధవారం పూజారులు, అధికారులతో చర్చించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు నివాస గృహానికి వెళ్లి సమ్మక్క ఆలయ శుద్ధి గురించి చర్చించారు. అనంతరం సమ్మక్క గుడిని సందర్శించారు. అక్కడి నుంచి గద్దెలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# చర్చలకు వస్తారా.. నాశనం అవుతారా




వాషింగ్టన్: అణు ఒప్పందంపై చర్చలకు రాని పక్షంలో ఇరాన్‌పై భీకర స్థాయిలో విరుచుకు పడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం హెచ్చరించారు. ''అణు ఒప్పందం కోసం ఇరాన్ త్వరగా చర్చలకు వస్తుందని భావిస్తున్నాను. అణ్వాయుధాలను నిషేధించే ఒప్పందం అందరికీ మేలు చేస్తుంది. భారీగా యుద్ధ నౌకలు ఇరాన్‌వైపు గొప్ప శక్తితో, ఉత్సాహంతో, వేగంతో, ఓ లక్ష్యంతో వెళుతున్నాయి. సమయం లేదు. ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్‌కు మరోసారి చెబుతున్నా'' అని 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ చర్చలకు రాకపోతే గతంలో కంటే భీకరస్థాయిలో దాడులు చేస్తాం.. నాశనం తప్పదని హెచ్చరించారు. మరోవైపు అమెరికా దాడికి సిద్ధమవుతున్న సూచనలు కనిపిస్తుండటంతో పశ్చిమాసియా దేశాల మద్దతు కూడగట్టే పనిలో ఇరాన్ నిమగ్నమైంది. ఇరాన్‌పై దాడికి అమెరికా తమ ఆకాశ మార్గాన్ని వినియోగించడానికి అనుమతించబోమని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు భరోసా ఇచ్చాయని తెలిసింది. ట్రంప్ హెచ్చరికపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. తమను యుద్ధం దిశగా నెడితే.. గతంలో ఎన్నడూ చేయని స్థాయిలో దాడి చేస్తామంది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.

# మహిళల జీవించే హక్కును లాగేసుకుంటున్నారు



**దేశంలో మనువాద భావజాల వ్యాప్తి ..**

**భావితరాల కోసం మహిళలు పోరాడాలి**

**ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి**

**12న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాం**

**ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి కనినిక ఘోష్**

హైదరాబాద్, : దేశవ్యాప్తంగా... ప్రధానంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మనుస్మృతిని అనుసరించే శక్తులు మహిళల జీవించే హక్కును లాక్కుంటున్నాయని అఖిల భారత ప్రజాస్వామిక మహిళా సంఘం(ఐద్వా) జాతీయ అధ్యక్షురాలు పి.కె.శ్రీమతి టీచర్ అన్నారు. దేశంలో వేగంగా మనువాద భావజాల వ్యాప్తి విస్తరణ జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలకు మెరుగైన జీవితం కోసం నేటి మహిళలు పోరాట మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఐద్వా 14వ జాతీయ మహాసభలో ఆమె జాతీయ అధ్యక్షురాలిగా తిరిగి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా ప్రతినిధులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మన పూర్వీకులు చేసిన పోరాటాల ఫలితంగానే మనం గతంలో కంటే కొంత మెరుగైన జీవితం గడుపుతున్నామని చెప్పారు. అనేక రంగాల్లో అభివృద్ధి సూచికల్లో భారతదేశం చాలా వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలపై దాడులు పెరగడంతో పాటు అణచివేత తీవ్రమవుతోందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కనినిక ఘోష్ బోస్ అన్నారు. అణగారిన వర్గాల మహిళలే మైక్రోఫైనాన్స్ వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. బ్యాంకులు పేద మహిళలకు రుణాలు ఇవ్వకుండా బీజేపీ విధానాలు ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లు తీసుకురావడాన్ని, నరేగా చట్టాన్ని నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్పొరేట్ మీడియాను ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రిస్తోందని, ప్రభుత్వరంగ సంస్థల్లో ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్నవారిని చొప్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహాసభల్లో ఐద్వా నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# గిన్నిస్ రికార్డులకు ఎక్కేలా 'గనుల మూసివేత' చేపట్టాలి



దిల్లీ: ఖనిజాలు వెలికి తీసిన తర్వాత గనులను పర్యావరణహితంగా మూసేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కేలా ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆయన బుధవారం దిల్లీలోని తన కార్యాలయం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న గనుల ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాల్లో చేపడుతున్న గనుల మూసివేత కార్యక్రమాలు, ఆ అంశంలో గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

'గనుల మూసివేత తవ్వకాల ముగింపునకు చిహ్నం కాదు. పర్యావరణం, సమాజం, భవిష్యత్తు పట్ల మనం క్రమశిక్షణతో నిర్వహించాల్సిన బాధ్యత. కలెక్టర్లు ప్రత్యేక వ్యూహంతో పర్యావరణ పునరుజ్జీవం, జలవనరుల సంరక్షణ, వాయుకాలుష్య నియంత్రణ, వాతావరణ సమతౌల్యం ఉండేలా మూసివేతను చేపట్టాలి. మూసివేతకు ముందు, తర్వాతి పరిస్థితులకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో ఉంచాలి' అని సూచించారు. జిల్లా మినరల్ ఫౌండేషన్(డీఎంఎఫ్) నిధులతో గనుల ప్రభావిత ప్రాంతాల్లోని నివాసాలకు సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సౌర విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చేందుకయ్యే ఖర్చును భరించే విషయంపై ఆలోచించాలని కలెక్టర్లకు సూచించారు.

# విమానయానరంగానికి కోపైలట్‌గా ఉండండి



**పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ పిలుపు**

**విమాన తయారీ, పైలట్ శిక్షణ, విమాన లీజింగ్‌లో భారీగా అవకాశాలు**

**ప్రతీ పౌరుడు సులభంగా విమానయానం చేసేలా చర్యలు**

**ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ, సీ–ప్లేన్స్ కోసం తదుపరి 'ఉడాన్ స్కీమ్'**

**ఇప్పటికే దేశీయంగా మిలటరీ విమానాల ఉత్పత్తి... ఇక పౌర విమానాల తయారీవైపు అడుగులు**

**ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా అవతరణ**

**'వింగ్స్ ఇండియా–2026'లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించిన ప్రధాని**

ఈకబురు హైదరాబాద్: భారత విమానయాన రంగం గత దశాబ్ద కాలంలో చరిత్రాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఒకప్పుడు దేశంలో విమానయానం కొద్దిమందికే పరిమితం కాగా.. నేడు భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా ఎదిగిందని చెప్పారు. విమాన తయారీ, పైలట్ శిక్షణ, అడ్వాన్స్డ్ ఎయిర్ మొబిలిటీ, విమాన లీజింగ్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని.. వీటిని పరిశ్రమల అధిపతులు, పెట్టుబడిదారులు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

మొత్తానికి భారత విమానయాన రంగానికి కోపైలట్‌గా ఉండాలని చెప్పారు. రాబోయే కాలంలో విమాన ప్రయాణాలకు డిమాండ్ భారీగా పెరిగి పెట్టుబడులకు విస్తృత అవకాశాలు దొరుకుతాయన్నారు. బుధవారం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో ప్రారంభమైన 'వింగ్స్ ఇండియా-2026' కార్యక్రమంలో పాల్గొన్నవారిని ఉద్దేశించి ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోదీ ప్రసంగించారు.

గత పదేళ్లలో దేశీయ విమానయాన రంగం అసాధారణ అభివృద్ధి సాధించిందని, ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగాయని వెల్లడించారు. ఇటీవలి సంవత్సరాల్లో భారతీయ విమానయాన సంస్థలు 1,500కు పైగా కొత్త విమానాలను ఆర్డర్ చేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల భాగస్వాములకు వింగ్స్ ఇండియా సదస్సు ఎంతో కీలకమన్నారు.

రెండో దశ 'ఉడాన్' స్కీమ్'

విమాన ప్రయాణాన్ని ప్రత్యేక హక్కుగా కాకుండా ప్రతి పౌరుడికి అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో పని చేశామని ప్రధాని మోదీ చెప్పారు. 2014లో దేశంలో కేవలం 70 విమానాశ్రయాలే ఉండగా, ప్రస్తుతం అవి 160కిపైగా చేరాయని, పదేళ్లలోనే రెట్టింపు కంటే ఎక్కువ విమానాశ్రయాలు నిర్మించినట్లు తెలిపారు. ప్రాంతీయ, ఎయిర్ కనెక్టివిటీ, స్లీ-ప్లేన్ ఆపరేషన్స్ కోసం రెండో దశ 'ఉడాన్ స్కీమ్' ఉంటుందన్నారు. ప్రతీ పౌరుడు సులభంగా విమానయానం చేసేందుకు వీలైన చర్యల్లో భాగంగా సరసమైన విమాన చార్జీల కోసం ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఉడాన్ పథకం ద్వారా ఇప్పటివరకు కోటిన్నర మంది ప్రయాణికులు, గతంలో లేని మార్గాల్లో కూడా ప్రయాణించారని తెలిపారు. 2047 నాటికి దేశంలో 400కు పైగా విమానాశ్రయాలు ఉండనున్నాయని, అభివృద్ధి చెందిన దేశంగా మారే దిశగా భారత్ ముందుకెళ్తున్నందున విమాన అనుసంధాన విస్తరణ మరింత వేగం పుంజుకుంటుందని పేర్కొన్నారు.

పర్యాటక రంగంపైనా దృష్టి

**దేశవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ, ఎక్కువ మంది విమాన ప్రయాణాన్ని ఎంచుకునే పరిస్థితి ఏర్పడుతోందని ప్రధాని మోదీ చెప్పారు. విమాన డిజైన్, తయారీ, మరమ్మతులు– నిర్వహణ వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. భారత్ ఇప్పటికే విమాన భాగాల తయారీలో కీలక దేశంగా మారిందని, దేశీయంగానే సైనిక, రవాణా విమానాలను ఉత్పత్తి చేస్తోందని చెప్పారు.**

## లాభాల్లో దేశీయ మార్కెట్ సూచీలు



దేశీయ మార్కెట్లు బుధవారం భారీ లాభాల్లో మొదలయ్యాయి. మన దేశం, ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదరడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. రూపాయి కోలుకోవడం కూడా కలిసివచ్చింది.

ఉదయం 9.41 గంటల సమయంలో సెన్సెక్స్ 431 పాయింట్ల లాభంతో 82,217 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ 136 పాయింట్లు పుంజుకొని 25,311 వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో సెన్సెక్స్ 700 పాయింట్ల వరకు లాభపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 91.57గా ఉంది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, యాక్సిస్ బ్యాంక్, హిందాల్కో, రిలయన్స్, కోల్ ఇండియా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో, మ్యాక్స్ హెల్త్ కేర్ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.

# బంగారం ధగధగలు.. రూ.8వేలు పెరిగిన పుత్తడి

అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ మదుపర్లు బంగారాన్ని సురక్షిత పెట్టుబడి సాధనంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి పుత్తడి (Gold Rate) ధరలు భారీగా పెరిగాయి. బుధవారం మధ్యాహ్నం రెండుగంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.1,70,447కు చేరింది. నిన్న నగరంలో 24క్యారెట్ల బంగారం ధర రూ.1,62,380 పలికింది. అంటే ఎనిమిది వేల మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,400గా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.3.75లక్షలుగా ఉందని బులియన్ వర్గాలు వెల్లడించాయి.

మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో (MCX) మార్చి నెల డెలివరీలో కిలో వెండి ధర బుధవారం వెండి రికార్డు స్థాయికి చేరింది. రూ.26,821కి పెరిగి రూ.3.83 లక్షలు పలికింది. 10 గ్రాముల బంగారం రూ.1.62 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 5296.79 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదే స్థాయిలో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. మరోవైపు వెండి సైతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు 114 డాలర్లుగా ఉంది. డాలర్ బలహీనతలు ఈ లోహాల ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. డాలర్ విలువ నేడు నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. ఓ వైపు తమ కరెన్సీ గొప్పగా ఉందని ట్రంప్ చెప్తుండగా.. ఆ తర్వాత కూడా డాలర్ మరింత బలహీనపడటడం గమనార్హం.




## అందరికి అందుబాటులోకి కొత్త ఆధార్ యాప్

కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను లాంచ్ చేసింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా, యూజర్ ఫ్రెండ్లీగా మారనున్నాయి. బుధవారం దిల్లీలో డాక్టర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు. 2009లో ఇదే రోజున (జనవరి 28న) ఆధార్‌ను లాంచ్ చేశారు (Aadhaar App).

ఫీచర్లు ఇవే..

ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు

చిరునామా, మొబైల్‌నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది

ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా కాంటాక్ట్ వివరాలను పంచుకోవచ్చు. ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు

ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు

ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొఫైల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు




## అమెజాన్‌లో 16వేల మంది
# ఉద్యోగులు తొలగింపు




ప్రముఖ ఇకామర్స్ సంస్థ అమెజాన్ (Amazon) మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన (Layoffs) పలుకుతున్నట్లు పేర్కొంది. ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.

తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

## కొత్త వాహనం.. అయినా టైరు పేలొచ్చు!

సాధారణంగా వాహనదారులు టైర్లలో గాలి ఉందా? ట్రెడ్ (గ్రిప్) కనిపిస్తోందా? అని మాత్రమే చూస్తుంటారు. కానీ, టైరు బయటకు కొత్తగా కనిపిస్తున్నా, దాని లోపల రబ్బరు నాణ్యత కోల్పోయి, పేలవంగా ఉండవచ్చని మీకు తెలుసా? వాహన భద్రతలో టైర్ తయారీ తేదీ (Manufacturing Date) అత్యంత కీలకమైన అంశమని అంతర్జాతీయ రవాణా భద్రతా సంస్థలు హెచ్చరిస్తున్నాయి.

ఎప్పుడు తయారైందో తెలుసుకోవడం ముఖ్యమా?

టైర్లు కేవలం రబ్బరుతో తయారు చేసిన వస్తువులు మాత్రమే కాదు; అవి రసాయనాలు, ఆయిల్స్, కొన్ని రకాల పాలిమర్ల మిశ్రమం. కాలక్రమేణా టైరు వాడినా వాడకపోయినా గాలిలోని ఆక్సిజన్, వేడి కారణంగా ఆ రబ్బరు గట్టిపడి 'ఆక్సిడైజేషన్' ప్రక్రియకు లోనవుతుంది. దీనివల్ల టైరు తన పట్టును (Grip) కోల్పోవడమే కాకుండా ప్రయాణంలో ఒక్కసారిగా పేలిపోయే (Blowout) ప్రమాదం ఉంది.

నిపుణుల హెచ్చరిక

టైర్ ట్రెడ్ బాగున్నా సరే తయారీ తేదీ నుంచి 6 ఏళ్లు దాటితే ఆ టైరును మార్చడం సురక్షితం. ఒకవేళ టైరును అసలు వాడకుండా స్పేర్ వీల్‌గా ఉంచితే 10 ఏళ్ల తర్వాత దాన్ని కచ్చితంగా తొలగించాలి.

ఎప్పుడు తయారైందో ఎలా తెలుసుకోవాలి?

ప్రతి టైరు సైడ్‌వాల్‌పై DOT (Department of Transportation) కోడ్ ఉంటుంది. ఇది టైరు తయారీ అంశాలను తెలియజేస్తుంది. ఈ కోడ్ చివర ఉండే నాలుగు అంకెలు అత్యంత ముఖ్యం. అందులో మొదటి రెండు అంకెలు తయారీ వారం (01 నుంచి 52 వరకు)ను తెలియజేస్తాయి. చివరి రెండు అంకెలు తయారీ సంవత్సరం తెలుపుతాయి.

ఉదాహరణకు:

మీ టైరుపై డాట్ కోడ్‌లో చివరి అంకెలు '2419' అని ఉంటే, అది 2019వ సంవత్సరం 24వ వారంలో తయారైందని అర్థం. ప్రస్తుతం 2026 నడుస్తోంది కాబట్టి, ఈ టైరుకు ఇప్పటికే 6 ఏళ్లు దాటిపోయాయి. దీన్ని వాడటం రిస్క్‌తో కూడుకుంది.

పాత టైర్లలో సహజంగా కనిపించేవి..

సైడ్‌వాల్‌పై చిన్న పగుళ్లు రావడం.

నల్లగా ఉండాల్సిన టైరు బూడిద రంగులోకి మారడం.

టైరు అక్కడక్కడ ఉబ్బినట్లు కనిపించడం.

రబ్బరు పీచులుగా ఊడిపోవడం.

టైర్ లైఫ్‌టైమ్ పెరగాలంటే..

కనీసం నెలకోసారి తయారీదారు సూచించిన పీఎస్ఐ (Pounds per Square Inch) ప్రకారం గాలిని తనిఖీ చేయండి.

ప్రతి 5,000 8,000 కి.మీలకు ఒకసారి టైర్ల స్థానాలను మార్చండి (Rotation).

వీల్ అలైన్‌మెంట్ సరిగ్గా లేకపోతే టైర్లు ఒకవైపు మాత్రమే అరిగిపోయి త్వరగా పాడవుతాయి.

ఎండలో ఎక్కువసేపు వాహనాన్ని ఉంచడం వల్ల రబ్బరు త్వరగా దెబ్బతింటుంది.



### హాయ్ ఫ్రెండ్స్... ఇన్‌స్టా ఇకపై
## ఫ్రీ కాకపోవచ్చు!

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి తన ప్లాట్‌ఫాంలలో కొత్త చెల్లింపు సబ్‌స్క్రిప్షన్లను ప్రవేశపెట్టేందుకు మెటా సిద్ధమవుతోంది. యాప్‌ల ప్రాథమిక వెర్షన్లు ఉచితంగానే కొనసాగుతాయి. అయితే ఉత్పాదకత, సృజనాత్మకత, ఆధునిక ఏఐ (AI) టూల్స్‌తో వచ్చే అదనపు ఫీచర్ల కోసం ప్రీమియం ప్లాన్‌లను పరీక్షించనున్నట్లు మెటా టెక్‌క్రంచ్‌కు ధ్రువీకరించింది.మెటా ప్రకారం.. ప్రతి యాప్‌కు దాని ప్రత్యేక ప్రయోజనాలకు అనుగుణంగా వేర్వేరు సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లు ఉంటాయి. ఒకే స్థిరమైన ప్లాన్‌కు బదులుగా, వివిధ ఫీచర్ బండిల్స్‌ను ప్రయోగాత్మకంగా అందించి, వినియోగదారులకు ఏవి ఉపయోగకరంగా ఉంటాయో తెలుసుకోవాలని కంపెనీ భావిస్తోంది.ఈ సబ్‌స్క్రిప్షన్‌లలో ప్రధానంగా ఏఐ ఫీచర్లు ఉండనున్నాయి. మెటా ఇటీవల సుమారు 2 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన 'మానస్' ఏఐ ఏజెంట్‌ను విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలని యోచిస్తోంది. మానస్‌ను మెటా యాప్‌లలోనే భాగంగా చేర్చడమే కాకుండా, వ్యాపారాల కోసం ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్‌గా కూడా అందించనుంది. ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్‌లో మానస్ ఏఐ షార్ట్‌కట్‌ను జోడించే పనిలో మెటా ఉంది.అలాగే, అధునాతన ఏఐ ఫీచర్లకు ఛార్జీలు వసూలు చేయాలని కూడా మెటా భావిస్తోంది. ఉదాహరణకు, 'వైబ్స్' అనే ఏఐ ఆధారిత షార్ట్-ఫార్మ్ వీడియో టూల్. దీంట్లో ఏఐని ఉపయోగించి వీడియోలను సృష్టించడం, రీమిక్స్ చేయడం వంటివి చేయొచ్చు. ఇప్పటివరకు ఉచితంగా ఉన్న ఈ ఫీచర్‌ను ప్రీమియం మోడల్‌కు మార్చే యోచనలో మెటా ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో సబ్‌స్క్రిప్షన్ తీసుకునే వినియోగదారులకు అపరిమిత ఆడియన్స్ లిస్టులు సృష్టించే అవకాశం, ఎవరు తిరిగి ఫాలో చేయడం లేదో తెలుసుకునే ఫీచర్, స్టోరీలను అనామకంగా వీక్షించే సౌకర్యం (పోస్టర్‌కు తెలియకుండా) వంటి అదనపు ఫీచర్లు అందుబాటులోకి రావొచ్చు.కాగా ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్‌లు, మెటా వెరిఫైడ్ వేరువేరు. మెటా వెరిఫైడ్ ప్రధానంగా క్రియేటర్లు, బిజినెస్ అకౌంట్ల కోసం రూపొందించినది. ఇందులో వెరిఫైడ్ బ్యాడ్జ్, డైరెక్ట్ సపోర్ట్, ఇంపర్సనేషన్ ప్రొటెక్షన్ వంటి ప్రయోజనాలు ఉంటాయి. రాబోయే కొత్త సబ్‌స్క్రిప్షన్‌లు మాత్రం సాధారణ రోజువారీ యూజర్ల కోసం తీసుకొస్తున్నవి.

# నాగార్జున @100

**టబు గురించి ఆసక్తి కరమైన వ్యాఖ్యలు చేసిన నాగార్జున..**



అక్కినేని నాగార్జున వందవ సినిమాపై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా గతేడాది పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. కుబేర, కూలీ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించిన నాగ్.. ఇప్పుడు పూర్తిగా తన వందవ సినిమాతోనే బిజీగా మారారు. ఈ చిత్రంలో నాగ్ సరసన ముగ్గురు భామలు నటిస్తున్నారని, అందులో సీనియర్ హీరోయిన్ టబు కూడా ఉందని వార్తలు వచ్చాయి. నాగార్జున, టబు మంచి స్నేహితులు అన్న విషయం అందరికీ తెల్సిందే. వీరిద్దరి కాంబోలో నిన్నే పెళ్లాడతా, ఆవిడే మా ఆవిడ వంటి హిట్ సినిమాలు వచ్చాయి. ఇక కింగ్ 100 వ సినిమాలో టబు ముచ్చటగా మూడోసారి నాగ్ తో రొమాన్స్ చేయనుందని టాక్ నడుస్తోంది. తాజాగా తన వందవ సినిమాలో టబు నటిస్తోంది అన్న వార్తలపై అక్కినేని నాగార్జున స్పందించారు. ఒక ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ' టబు నాకు ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి తెలుసు. మేమిద్దరం మంచి స్నేహితులం. నేను వందవ సినిమా చేస్తున్నాను అని తెలుసుకొని టబు అందులో భాగం కావాలని కోరుకుంది' అని తెలిపారు. నాగ్ వ్యాఖ్యలు టబు తన వందవ సినిమాలో నటిస్తోందని కన్ఫర్మ్ చేసినట్లే ఉన్నాయని చెప్పొచ్చు. నాగార్జున కింగ్ 100 వ సినిమా గురించి మాట్లాడుతూ.. ' ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైంది. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందనే అనుకుంటున్నాను. ప్రేక్షకుల అభిరుచులు ఎప్పటికప్పుడు మారుతూ ఉన్నాయి. వారి అభిరుచికి తగ్గట్లే మేము కూడా మారుతున్నాము. ఈ సినిమాలో యాక్షన్ సీన్స్ రియల్ గా చేస్తున్నాం. ఎలాంటి విఎఫ్ఎక్స్ ఉపయోగించడం లేదు. త్వరగా రిలీజ్ చేయాలని కంగారు పడకుండా నెమ్మదిగా సినిమాను ఫినిష్ చేసి రిలీజ్ చేస్తాం' అని చెప్పారు.

# పెళ్లి పుకార్లకు చెక్



బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోన్న విషయం తెల్సిందే. ఇప్పుడు మృణాల్.. కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమయింది. అందుతున్న సమాచారం ప్రకారం కోలీవుడ్ స్టార్ హీరో శింబు సరసన మృణాల్ నటిస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. శింబు ప్రస్తుతం అరసన్ సినిమాతో బిజీగా ఉన్నాడు. వెట్రిమారన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. ఇది కాకుండా శింబు.. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనుంది. ఇక అందుతున్న సమాచారం ప్రకారం శింబు అశ్వత్ మారిముత్తు సినిమాలో మృణాల్ ఠాకూర్ ని హీరోయిన్ గా సెలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాతోనే మృణాల్ కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తతో ధనుష్ మృణాల్ పెళ్లి పుకార్లకు ఫుల్ స్టాప్ పడినట్లు కోలీవుడ్ మీడియా చెప్తుంది. అదెలా అంటే.. కొన్నేళ్లుగా ధనుష్ శింబు మధ్య మాటలు లేవని, పైకి నవ్వుతూ కనిపించినా వారిద్దరి మధ్య విరోధం ఉందని తమిళ్ ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది.
ధనుష్ తో మృణాల్ పెళ్లి అనేది నిజమైతే ఆమె తనకు కాబోయే భర్తకు విరోధిగా ఉన్న శింబుతో రొమాన్స్ చేయడానికి ఎందుకు ఒప్పుకుంటుంది.. ఒకవేళ ఆమె ఒప్పుకున్నా దానికి ధనుష్ ఎలా అంగీకరిస్తాడు. శింబుతో మృణాల్ నటిస్తోంది అంటే.. ధనుష్ తో పెళ్లి నిజం కాదన్న మాటే కదా అని తమిళ్ తంబీలు అంటున్నారు. ధనుష్ తో పెళ్లి పుకార్లను మృణాల్ ఇన్ డైరెక్ట్ గా ఇలా ఖండించిందని కూడా చెప్తున్నారు. మరి ఇందులో ఎంతవరకు నిజమున్నది అనేది తెలియాల్సి ఉంది.

## దర్శకుడు ఎన్. శంకర్‌కు.. మాతృ వియోగం

ప్రముఖ దర్శకుడు.. శ్రీరాములయ్య, భద్రాచలం, జయం మనదేరా, ఆయుధం, జైబోలో తెలంగాణ చిత్రాల ఫేమ్ శంకర్ ఇంట విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సక్కుబాయమ్మ ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమె అంతిమ సంస్కారాలు గురువారం మహా ప్రస్తానంలో జరుగనున్నాయి. అభిమానులు రేపు ఉదయం HIG block 11,చిత్రపురి కాలనీ, హైద్రాబాద్‌లో భౌతిక కాయాన్ని సందర్శించవచ్చు శంకర్ స్వగ్రామం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చిరుమర్తి.



# రజనీకాంత్ ఆటోబయోగ్రఫీ.. ఐశ్వర్య ఆసక్తికర వ్యాఖ్యలు



రజనీకాంత్.. నటుడిగానే కాదు వ్యక్తిగానూ ఎందరికో ఆదర్శం. బస్ కండక్టర్ నుంచి సూపర్‌స్టార్‌గా సాగిన ప్రయాణం స్ఫూర్తిదాయకం. రజనీకాంత్ జీవితం తెరపైకి వస్తుందంటూ కొన్నాళ్ల క్రితం ప్రచారం జరిగింది. ఆ బయోపిక్ గురించి అధికారిక ప్రకటన కూడా లేదు. అయితే, తాజాగా రజనీ కుమార్తె ఐశ్వర్య అభిమానులకు శుభవార్త చెప్పారు. తన తండ్రి ఆటోబయోగ్రఫీ వర్క్‌ను ఇప్పటికే ప్రారంభించారని తెలిపారు. అది ప్రపంచవ్యాప్తంగా ఓ సెన్సేషన్ అవుతుందంటూ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తి రేకెత్తించారు. సూపర్‌స్టార్ కుమార్తెగా ఉండటం అంత తేలికైన విషయం కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సినీ రంగంలో ఏఐ వినియోగం మంచి పరిణామమే అయినా.. అది ఎప్పటికైనా కృత్రిమమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అభిప్రాయపడ్డారు. 'కోచ్చాడయాన్' (2014)లాంటి సినిమాలు తీయడం తనకు ఇష్టమన్నారు. అధునాతన సాంకేతికతో అలాంటి చిత్రాలను ఇప్పుడు తెరకెక్కించడం సులువు అని పేర్కొన్నారు. '3', 'లాల్ సలామ్'లాంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఐశ్వర్య 'విత్ లవ్' కు నిర్మాతగా వ్యవహరించారు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా మదన్ తెరకెక్కించిన రొమాంటిక్ మూవీ ఇది. అనస్వర రాజన్ హీరోయిన్. ఈ సినిమా తెలుగులోనూ ఫిబ్రవరి 6న విడుదల కానుంది

# వెంకటేశ్‌తో ఆ మూవీ.. ఇదే మంచి తరుణం: తరుణ్ భాస్కర్



'పెళ్లి చూపులు', 'ఈ నగరానికి ఏమైంది' లాంటి విభిన్న చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు తరుణ్ భాస్కర్. వెంకటేశ్ హీరోగా ఓ సినిమా చేయనున్నట్లు కొన్నాళ్ల క్రితమే చెప్పిన సంగతి తెలిసిందే. కానీ, తర్వాత డైరెక్టర్‌గానే కాకుండా నటుడిగా వేరే సినిమాలతో బిజీగా ఉండటంతో వెంకీతో మూవీ ఆగిపోయిందన్న ప్రచారం జరిగింది. తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆ సినిమాపై స్పందించారు. సినిమా నిలిచిపోలేదన్నారు. డెక్కన్ డార్బీ (గుర్రపు పందెం) నేపథ్యంతో రాసుకున్న ఆ కథ.. ఇప్పుడే ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని అభిప్రాయపడ్డారు. స్క్రిప్టు సిద్ధమైనా దాని ద్వితీయార్ధంలో కొన్ని చోట్ల సంతృప్తి కలగకపోవడంతో దానిపై వర్క్ చేసేందుకు మరింత సమయం తీసుకున్నానని తరుణ్ గత ఇంటర్వ్యూలో తెలిపారు. అది ఆలస్యం కావడంతో 'కీడా కోలా' తెరకెక్కించారు. ఇందులో ఆయన కూడా నటించడం విశేషం. ప్రస్తుతం వెంకటేశ్.. త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం'లో నటిస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం'లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు అనిల్ రావిపూడితో వెంకీ మరో సినిమా చేయనున్నట్లు సమాచారం. ఇవి పూర్తయ్యాక తరుణ్ భాస్కర్‌తో సినిమా చేసే అవకాశాలున్నాయి. తరుణ్ హీరోగా ప్రతిభను చాటేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన సినిమా 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషారెబ్బా హీరోయిన్. భర్త అహంకారాన్ని భార్య ఎలా అణిచిందన్న కాన్సెప్టుతో వచ్చిన మలయాళ మూవీ 'జయ జయ జయ జయహే'కు రీమేక్‌గా రూపొందింది. ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఇకపై నటనకు కాస్త విరామం ఇచ్చి, దర్శకత్వంపైనే దృష్టి పెడతానని తరుణ్ తెలిపారు.
ప్రస్తుతం 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ తెరకెక్కిస్తున్నానని చెప్పారు. కొత్త నటులతో మరో సినిమా రూపొందిస్తానన్నారు.

## విజయ్ దేనికీ భయపడడు.. 'జన నాయగన్' ఇష్యూపై నటుడి తండ్రి



విజయ్ హీరోగా తెరకెక్కిన 'జన నాయగన్' సినిమా వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఈ నెల 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. సినిమా విడుదల జాప్యంపై విజయ్ తండ్రి, దర్శక, నిర్మాత ఎస్.ఎ .చంద్రశేఖర్ స్పందించారు. విజయ్ ఎలాంటి సవాళ్లకు భయపడడని, తనకు ఎదురయ్యే ప్రతి అడ్డంకిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాడని పేర్కొన్నారు. ''కరూర్‌లో ఏం జరిగిందో ప్రజలకు తెలుసు. విజయ్ దేనికీ భయపడడు. రాజకీయాల్లో అడుగుపెట్టిన తొలినాళ్లలో ఇలాంటి అవరోధాలు సాధారణమే. విజయ్ ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొంటాడు. అనుకున్న సమయానికి 'జన నాయగన్' ఎందుకు విడుదల కాలేదన్న దానిపై ప్రజలకు అవగాహన ఉంది. విజయ్ పాలిటిక్స్‌లోకి వచ్చాక యువత రాజకీయం గురించి మాట్లాడుతోంది. నా కన్నా వారికే స్పష్టత ఉంది'' అని పేర్కొన్నారు. జన నాయగన్‌కు యు/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలంటూ సెన్సార్ బోర్డుకు జనవరి 9న మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ సదరు నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. జనవరి 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని సింగిల్ బెంచ్‌ను మంగళవారం ఆదేశించింది. దీంతో, ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నట్టు సమాచారం.

# పెద్ది వాయిదా.. ఆ పండగే టార్గెట్



ఆర్ఆర్ఆర్ చిత్రంతో గ్లోబల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్.. ఆ తరువాత మాత్రం ఆ స్థాయి విజయాలను నమోదు చేయలేకపోయాడు. ఆర్ఆర్ఆర్ తరువాత వచ్చిన ఆచార్య నిరాశపరచడం, ఎన్నో ఆశలు పెట్టుకున్న గేమ్ ఛేంజర్ ఫలితం మెగాభిమానులను బాగా కలవరపరిచింది. దీంతో అందరి దృష్టి బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా మీదే పడింది. నిజానికి ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పుడు.. ఉప్పెన లాంటి లవ్ స్టోరీ తీసిన బుచ్చిబాబు, చరణ్‌తో ఎలాంటి సినిమా తీస్తాడో అని అందరూ సందేహించారు. కానీ, పెద్ది షాట్ బయటకి రాగానే అందరి నోళ్లు మూతపడ్డాయి. ఈసారి చరణ్‌ను మునుపెన్నడూ చూడని ఒక రా అండ్ రస్టిక్ మాస్ అవతారంలో బుచ్చిబాబు ప్రజెంట్ చేయబోతున్నాడని అందరికి అర్థమైంది. ఇక ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన చికిరి చికిరి సాంగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ పాట సోషల్ మీడియాను ఎలా షేక్ చేసిందో చూశాం.. ఆ బీట్ వింటుంటేనే థియేటర్లలో రచ్చ ఎలా ఉండబోతుందో అర్థమవుతోంది. పెద్ది సినిమాను తొలుత మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కానుకగా రిలీజ్ చేయనున్నారని మేకర్స్ తెలిపారు. సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌లో రిలీజ్ డేట్ పక్కాగా ఉండేలా చూసుకున్నారు. కానీ, ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. పెద్ది చెప్పిన సమయానికి రావడం లేదని తెలుస్తోంది. షూటింగ్ ఇంకా కొంత పెండింగ్ ఉండడం, దానికి తోడు.. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని బుచ్చిబాబు టీం పట్టుదలతో ఉందట. అందుకే, ఈ సమ్మర్ రేసు నుంచి తప్పుకుని.. దసరా పండగ సీజన్‌ను టార్గెట్ చేశారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఆలస్యంగా వచ్చినా.. చరణ్ చేసే అటాక్ మాత్రం అరాచకంగా ఉండబోతోందని టాక్ నడుస్తోంది. ఇక ఇప్పుడు టాలీవుడ్‌లో మెగా మేనియా నడుస్తోంది. ఒకవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ OGతో గ్రాండ్ కంబ్యాక్ ఇవ్వగా, మరోవైపు మెగాస్టార్ చిరంజీవి మన శంకరవరప్రసాద్‌గారు చిత్రంతో బాక్సాఫీస్ కింగ్ అని మరోసారి నిరూపించుకున్నారు. బాబాయ్ హిట్టు కొట్టాడు.. నాన్న బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు.. మరి అబ్బాయి రేంజ్ ఎలా ఉండాలి? పెద్దితో రామ్ చరణ్ కొట్టే దెబ్బకు సౌత్ ఇండియా మొత్తం దద్దరిల్లిపోవాల్సిందే అనే రేంజ్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సమ్మర్ అయినా, దసరా అయినా.. పెద్ది రాక బాక్సాఫీస్ దగ్గర ఒక ప్రభంజనమే సృష్టిస్తుందని మెగా ఫ్యాన్స్ చాలా ధీమాగా ఉన్నారు. మరి చరణ్ ఈసారి ఎలాంటి రికార్డులు సృష్టిస్తాడో చూడాలి.

# బెంగళూరు ఫైనల్ చేరేందుకు ఆఖరి అవకాశం




వడోదర: ఇరవై రోజులుగా జరుగుతున్న మహిళల ప్రీమియర్ లీగ్ 'ప్లేఆఫ్స్' రేస్ మజిలీకి చేరింది. ఐదు జట్లలో ఒక్క రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మాత్రమే ప్లేఆఫ్స్‌కు అర్హత సంపాదించింది. వరుసగా ఐదు మ్యాచ్‌లు గెలిచి పది రోజుల క్రితమే అందలమెక్కిన ఆర్‌సీబీ... నేరుగా ఫైనల్ చేరే అవకాశాన్ని మాత్రం అందిపుచ్చుకునేందుకు ఆపసోపాలు పడుతోంది.

ఇటీవల ఢిల్లీ, ముంబై జట్లతో జరిగిన వరుస మ్యాచ్‌ల్లో బెంగళూరు ఓడింది. ఇప్పుడు ఆర్‌సీబీకి మిగిలింది ఆఖరి మ్యాచ్. గురువారం యూపీ వారియర్స్‌తో జరిగే ఈ పోరులో గెలిస్తే లీగ్ నిబంధనల ప్రకారం 'టాప్'లో నిలిచి ఆర్‌సీబీ టీమ్ నేరుగా టైటిల్ వేటలో నిలుస్తుంది. అలాగని ఓడితే అగ్రస్థానం ఉన్నఫళంగా చేజారదు.

ఎందుకంటే పట్టికలో బెంగళూరు సరసన 10 పాయింట్లు నెగ్గే అర్హత ఒక్క గుజరాత్ జెయింట్స్‌కే ఉంది. కానీ ఈ జట్టు రన్‌రేట్‌లో చాలా వెనుకబడి ఉంది. ఇక ప్రస్తుత మ్యాచ్ యూపీ వారియర్స్‌కే అత్యంత కీలకం. ఇందులో ఓడిపోతే ఇంకో మ్యాచ్ ఉన్నప్పటికీ యూపీ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. రాత్రి 7:30 గంటల నుంచి 'స్టార్‌స్పోర్ట్స్', 'జియో హాట్‌స్టార్'లో ప్రత్యక్ష ప్రసారం

# హార్దిక్, అర్ష్ దీప్ కీలకం: రోహిత్



న్యూఢిల్లీ: భారత జట్టు టి20 వరల్డ్ కప్ నిలబెట్టుకోవాలంటే అర్ష్ దీప్ సింగ్, హార్దిక్ పాండ్యాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జట్టు మాజీ కెప్టెన్, బ్యాటర్ రోహిత్ శర్మ అభిప్రాయపడ్డాడు. కొత్త బంతితో అర్ష్ దీప్ చాలా ప్రమాదకారి అని, మిడిలార్డర్‌లో పాండ్యా బలమైన బ్యాటింగ్ జట్టుకు అదనపు ప్రయోజనాన్ని ఇస్తుందని రోహిత్ అన్నాడు. రోహిత్ నాయకత్వంలోనే 2024లో టీమిండియా వరల్డ్ కప్ విజేతగా నిలిచింది.

'కొత్త, పాత బంతులను ఒకే తరహాలో స్వింగ్ చేయడం అర్ష్ దీప్ ప్రత్యేక బలం కాగా రెండు సందర్భాల్లోనూ వికెట్లు పడగొట్టగలడు. 2024 ఫైనల్లో అతను చాలా బాగా బౌలింగ్ చేసాడు. ఆరంభంలో డికాక్ వికెట్ తీసిన అర్ష్ దీప్ 19వ ఓవర్లో తక్కువ పరుగులు ఇవ్వడం విజయానికి బాటలు వేసింది.

ఈసారీ అదే జరుగుతుంది. జట్టులో పాండ్యా కూడా ఆల్‌రౌండర్‌గా ఎంతో విలువైన ఆటగాడు. బ్యాటింగ్ చివరి నాలుగు ఓవర్లలో 50 పరుగులు రాబట్టగలడు. అవసరమైతే 50/4 స్కోరు నుంచి జట్టు ఇన్నింగ్స్‌ను నిలబెట్టగలడు. పైగా ఏ దశలోనైనా బౌలింగ్ చేయగల సామర్థ్యం కూడా అతని సొంతం' అని రోహిత్ ప్రశంసించాడు.

# నాలుగోది చేజారె...



**వైజాగ్ టి20లో భారత్ పరాజయం**
**50 పరుగులతో న్యూజిలాండ్ గెలుపు**
**శివమ్ దూబే మెరుపులు వృథా**
**తిరువనంతపురంలో శనివారం చివరి టి20**

టి20 సిరీస్‌లో వరుసగా మూడు అద్భుత ప్రదర్శనల తర్వాత భారత జట్టు విశాఖ తీరంలో న్యూజిలాండ్ ముందు తలవంచింది. 216 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తొలి బంతికే అభిషేక్ శర్మ అవుట్‌తో మొదలైన ఇన్నింగ్స్ చివరకు ఓటమితో ముగిసింది. 15 బంతుల అర్ధ సెంచరీతో శివమ్ దూబే పోరాడినా... దురదృష్టవశాత్తూ అతని నిష్క్రమణతో ఓటమి ఖాయమైంది. సీఫెర్ట్, కాన్వే, సాంట్నర్‌ల మెరుగైన ప్రదర్శనతో ఎట్టకేలకు సిరీస్‌లో తొలి గెలుపుతో కివీస్‌కు కాస్త ఊరట దక్కింది.

విశాఖపట్నం: న్యూజిలాండ్‌తో టి20 సిరీస్‌లో టీమిండియాకు తొలి పరాజయం ఎదురైంది. సిరీస్ గెలుచుకున్న తర్వాత బుధవారం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన నాలుగో మ్యాచ్‌లో కివీస్ 50 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. టిమ్ సీఫెర్ట్ (36 బంతుల్లో 62; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవాన్ కాన్వే (23 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 50 బంతుల్లోనే 100 పరుగులు జోడించగా... చివర్లో డరైల్ మిచెల్ (18 బంతుల్లో 39 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిని ప్రదర్శించాడు. అనంతరం భారత్ 18.4 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది.

శివమ్ దూబే (23 బంతుల్లో 65; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. రింకూ సింగ్ (39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. సిరీస్‌లో భారత్ 3-1తో ఆధిక్యంలో ఉండగా, చివరి పోరు శనివారం తిరువనంతపురంలో జరుగుతుంది.

ఓపెనర్ల దూకుడు...

అర్ష్ దీప్ వేసిన తొలి ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టి కివీస్ ఇన్నింగ్స్‌ను జోరుగా మొదలు పెట్టిన సీఫెర్ట్... హర్షిత్ వేసిన తర్వాతి ఓవర్లో సిక్స్, ఫోర్ బాదాడు. అతడి మరుసటి ఓవర్లో కూడా ఓపెనర్లిద్దరు కలిసి 15 పరుగులు రాబట్టగా... రవి బిష్ణోయ్ తొలి ఓవర్లో కాన్వే 2 ఫోర్లు, సిక్స్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 71 పరుగులకు చేరింది. 25 బంతుల్లో సీఫెర్ట్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే శతక భాగస్వామ్యం తర్వాత కివీస్ 35 బంతుల వ్యవధిలో 37 పరుగులు మాత్రమే చేసి నాలుగు వికెట్లు చేజార్చుకుంది. గ్లెన్ ఫిలిప్స్ (16 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్) కొంత దూకుడుగా ఆడగా, చివరి 3 ఓవర్లలో 47 పరుగులు రాబట్టి న్యూజిలాండ్ మెరుగైన స్కోరును అందుకుంది. బుమ్రా వేసిన 19వ ఓవర్లో మిచెల్, హెన్రీ (6 నాటౌట్) కలిసి 2 ఫోర్లు, సిక్స్ సహా మొత్తం 19 పరుగులు సాధించారు.




దూబే సిక్సర్ల జోరు...

భారీ లక్ష్య ఛేదనలో అభిషేక్ శర్మ (0) ఇన్నింగ్స్ తొలి బంతికే వెనుదిరగ్గా... కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (8) కూడా విఫలమయ్యాడు. సామ్సన్ (15 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా భారీ స్కోరు చేయడంలో మళ్లీ విఫలం కాగా, హార్దిక్ పాండ్యా (2) ప్రభావం చూపలేదు. వరుసగా రెండు సిక్సర్లతో తన స్కోరును మొదలు పెట్టిన రింకూ ఆ తర్వాతా కొన్ని చక్కటి షాట్లు ఆడాడు.

రింకూ అవుటైన తర్వాత దూబే మెరుపు షాట్లతో జట్టు విజయంపై ఆశలు రేపాడు. తొలి బంతికే సిక్స్‌తో ఖాతా తెరిచిన దూబే... సోధి ఓవర్లో వరుసగా 2, 4, (వైడ్), 6, 4, 6, 6 బాదడంతో మొత్తం 29 పరుగులు లభించాయి. డఫీ వేసిన తర్వాతి ఓవర్లో కూడా అతను మరో 2 సిక్స్‌లు కొట్టి 15 బంతుల్లోనే అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే దురదృష్టవశాత్తూ అతను రనౌటయ్యాడు. 31 బంతుల్లో 71 పరుగులు చేయాల్సిన స్థితిలో హర్షిత్ కొట్టిన షాట్ బౌలర్ హెన్రీ చేతికి తగిలి నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌లో స్టంప్స్‌కు తగిలింది. దాంతో దూబే అవుట్ కావడంతో పాటు భారత్ గెలుపు ఆశలు ముగిశాయి.

4 రెండేళ్ల క్రితం టి20 ప్రపంచకప్ సాధించిన తర్వాత భారత జట్టు 40 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడింది. కేవలం నాలుగుసార్లు మాత్రమే టీమిండియా ఆలౌటైంది. భారత్‌ను ఆలౌట్ చేసిన జట్లలో జింబాబ్వే, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఉన్నాయి.

2 అంతర్జాతీయ టి20ల్లో 'గోల్డెన్ డక్'గా వెనుదిరగడం అభిషేక్ శర్మకిది రెండోసారి. ఈ భారత క్రికెటర్ల జాబితాలో రోహిత్ శర్మ (3 సార్లు) తొలి స్థానంలో ఉన్నాడు. కేఎల్ రాహుల్, సంజు సామ్సన్, అభిషేక్ శర్మ (2 సార్లు చొప్పున) ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నారు.

3 అంతర్జాతీయ టి20ల్లో వేగవంతమైన అర్ధ సెంచరీ చేసిన మూడో భారతీయ బ్యాటర్‌గా శివమ్ దూబే (15 బంతుల్లో) నిలిచాడు. తొలి రెండు స్థానాల్లో యువరాజ్ సింగ్ (12 బంతుల్లో), అభిషేక్ శర్మ (14 బంతుల్లో) ఉన్నారు.

4 రింకూ సింగ్ ఈ మ్యాచ్‌లో ఫీల్డర్‌గా 4 క్యాచ్‌లు అందుకొని భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు పట్టిన అజింక్య రహానే రికార్డు (4)ను సమం చేశాడు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) రింకూ (బి) కుల్దీప్ 44; సీఫెర్ట్ (సి) రింకూ (బి) అర్ష్ దీప్ 62; రచిన్ (సి అండ్ బి) బుమ్రా 2; ఫిలిప్స్ (సి) రింకూ (బి) కుల్దీప్ 24; చాప్‌మన్ (సి) హర్షిత్ (బి) బిష్ణోయ్ 9; మిచెల్ (నాటౌట్) 39; సాంట్నర్ (రనౌట్) 11; ఫోక్స్ (సి) రింకూ (బి) అర్ష్ దీప్ 13; హెన్రీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 215. వికెట్ల పతనం: 1-100, 2-103, 3-126, 4-137, 5-152, 6-163, 7-182. బౌలింగ్: అర్ష్ దీప్ 4-0-33-2, హర్షిత్ 4-0-54-0, బుమ్రా 4-0-38-1, రవి బిష్ణోయ్ 4-0-49-1, కుల్దీప్ యాదవ్ 4-0-39-2.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) కాన్వే (బి) హెన్రీ 0; సామ్సన్ (బి) సాంట్నర్ 24; సూర్యకుమార్ (సి అండ్ బి) డఫీ 8; రింకూ (ఎల్బీ) (బి) ఫోక్స్ 39; పాండ్యా (సి) ఫోక్స్ (బి) సాంట్నర్ 2; దూబే (రనౌట్) 65; హర్షిత్ (సి) రచిన్ (బి) సోధి 9; రవి బిష్ణోయ్ (నాటౌట్) 10; అర్ష్ దీప్ (సి) సాంట్నర్ (బి) సోధి 0; బుమ్రా (సి) సోధి (బి) సాంట్నర్ 4; కుల్దీప్ (సి) సీఫెర్ట్ (బి) డఫీ 1; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 165. వికెట్ల పతనం: 1-0, 2-9, 3-55, 4-63, 5-82, 6-145, 7-157, 8-157, 9-162, 10-165. బౌలింగ్: హెన్రీ 3-0-24-1, డఫీ 3.4-0- 33-2, ఫోక్స్ 3-0-29-1, సోధి 4-0-46-2, సాంట్నర్ 4-0-26-3, ఫిలిప్స్ 1-0-7-0.

# స్వియాటెక్ అవుట్



**ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మరోసారి నిరాశ**
**'కెరీర్ గ్రాండ్‌స్లామ్' ఘనత కోసం తప్పని నిరీక్షణ**
**పోలాండ్ స్టార్‌పై వరుస సెట్‌లలో నెగ్గిన రిబాకినా**
**అనిసిమోవాపై గెలుపుతో సెమీస్‌లో పెగూలా**

మెల్‌బోర్న్: అందని ద్రాక్షగా ఉన్న ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను సాధించి 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' ఘనత సాధించాలని ఆశించిన పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్‌కు మరోసారి నిరాశ ఎదురైంది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీగా జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఎనిమిదోసారి బరిలోకి దిగిన స్వియాటెక్ ఈసారి క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటలేకపోయింది. కజకిస్తాన్ స్టార్, ప్రపంచ ఐదో ర్యాంకర్ ఎలెనా రిబాకినా 7-5, 6-1తో ప్రపంచ రెండో ర్యాంకర్ స్వియాటెక్‌ను బోల్తా కొట్టించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రిబాకినా చేతిలో స్వియాటెక్ ఓడిపోవడం ఇది రెండోసారి. 2023లో ప్రిక్వార్టర్ ఫైనల్లో రిబాకినా 6-4, 6-4తో స్వియాటెక్‌ను ఓడించింది. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో స్వియాటెక్‌పై రెండుసార్లు నెగ్గిన ఏకైక ప్లేయర్‌గా రిబాకినా నిలిచింది. స్వియాటెక్‌తో 95 నిమిషాల పాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో రిబాకినా 11 ఏస్‌లు సంధించింది. మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 29 పాయింట్లకు 23 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 30 పాయింట్లకు 17 పాయింట్లు సంపాదించింది.

26 విన్నర్స్ కొట్టిన 2023 రన్నరప్... 19 అనవసర తప్పిదాలు చేసింది. నెట్ వద్దకు ఏడుసార్లు దూసుకొచ్చి ఆరుసార్లు పాయింట్లు గెలిచిన రిబాకినా తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, స్వియాటెక్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు స్వియాటెక్ 10 విన్నర్స్ కొట్టి, 25 అనవసర తప్పిదాలు చేసింది. 24 ఏళ్ల స్వియాటెక్ నాలుగుసార్లు (2020, 2022, 2023, 2024) ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను... ఒకసారి (2025) వింబుల్డన్ టైటిల్‌ను...ఒకసారి (2022) యూఎస్ ఓపెన్ టైటిల్‌ను సాధించింది.

వచ్చే ఏడాది స్వియాటెక్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను సాధిస్తే... మరియా షరపోవా (2012లో) తర్వాత 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకున్న రెండో క్రీడాకారిణిగా... ఓవరాల్‌గా 11వ క్రీడాకారిణిగా గుర్తింపు పొందుతుంది.

అనిసిమోవా నిష్క్రమణ

గత ఏడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ నాలుగో ర్యాంకర్ అనిసిమోవా (అమెరికా) ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాత్రం అద్భుతం చేయలేకపోయింది. అమెరికాకే చెందిన ఆరో సీడ్ జెస్సికా పెగూలాతో జరిగిన మ్యాచ్‌లో అనిసిమోవా 2-6, 6-7 (1/7)తో ఓడిపోయింది.

అనిసిమోవాపై గెలుపుతో పెగూలా తన కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరింది. ఈ మ్యాచ్‌లో పెగూలా ఆరు ఏస్‌లు సంధించింది. మరోవైపు అనిసిమోవా ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. అనిసిమోవా 18 విన్నర్స్‌తో పోలిస్తే 20 విన్నర్స్ కొట్టిన పెగూలా 21 అనవసర తప్పిదాలు చేసింది. అనిసిమోవా 44 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. నాలుగుసార్లు అనిసిమోవా సర్వీస్‌ను బ్రేక్ చేసిన పెగూలా తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది.

నేటి మహిళల సెమీఫైనల్స్
సబలెంకా x స్వితోలినా
పెగూలా x రిబాకినా
మధ్యాహ్నం 2 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

జొకోవిచ్‌ను గట్టెక్కించిన ముసెట్టి గాయం

పురుషుల సింగిల్స్ విభాగంలో 10 సార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినెర్ (ఇటలీ) సెమీఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో జొకోవిచ్‌కు ప్రత్యర్థి లొరెంజో ముసెట్టి (ఇటలీ) గాయం గట్టెక్కించగా... సినెర్ 6-3, 6-4, 6-4తో ఎనిమిదో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)పై విజయం సాధించాడు.

ముసెట్టితో జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ తొలి రెండు సెట్‌లను 4-6, 3-6తో కోల్పోయాడు. మూడో సెట్‌లో మాత్రం 3-1తో ఆధిక్యంలో ఉన్నాడు. ఈ దశలో ముసెట్టి కాలికి గాయం కావడంతో అతను వైదొలిగాడు. దాంతో ఓడిపోయే అవకాశాలున్న చోట జొకోవిచ్ అదృష్టవశాత్తూ విజయతీరానికి చేరాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో జ్వెరెవ్ (జర్మనీ)తో అల్‌కరాజ్; సినెర్‌తో జొకోవిచ్ తలపడతారు.

1 ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో తొలి రెండు సెట్‌లు గెలిచి, ఆ తర్వాత గాయం కారణంగా వైదొలిగిన తొలి ప్లేయర్‌గా లొరెంజో ముసెట్టి నిలిచాడు.

5 ఓపెన్ శకంలో (1968 నుంచి) వరుసగా ఆరు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్‌కు చేరిన ఐదో ప్లేయర్‌గా సినెర్ గుర్తింపు పొందాడు. గతంలో ఇవాన్ లెండిల్, ఫెడరర్, జొకోవిచ్, నాదల్ ఈ ఘనత సాధించారు.

6 ఓపెన్ శకంలో (1968 నుంచి) ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగుసార్లు సెమీఫైనల్‌కు చేరిన ఆరో ప్లేయర్‌గా జొకోవిచ్ నిలిచాడు. గతంలో గిలెర్మో విలాస్, ఇవాన్ లెండిల్, స్టీఫెన్ ఎడ్బర్గ్, ఫెడరర్, ఆండీ ముర్రే ఈ ఘనత సాధించారు.

103 ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో అత్యధిక విజయాలు సాధించిన ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. 102 విజయాలతో ఫెడరర్ పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు.



# గుకేశ్ విజయం.. అర్జున్ ఓటమి

**విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీ టైటిల్ రేసులో భారత గ్రాండ్‌మాస్టర్లు తడబడుతున్నారు. అర్జున్ ఇరిగేశి మరో పరాజయం చవిచూశాడు. అతడు పదో రౌండ్లో విన్సెంట్ కెయ్‌మర్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు. గత రౌండ్లో ఓడిన ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ పదో రౌండ్లో యాగిజ్ ఖాన్ (తుర్కియే)పై విజయం సాధించాడు. గుకేశ్ అయిదు, అర్జున్ నాలుగు పాయింట్లతో కొనసాగుతున్నారు. ప్రజ్ఞానంద.. నీమన్ (అమెరికా)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. అతడి ఖాతాలో 4.5 పాయింట్లు ఉన్నాయి. అబ్దుసతారోవ్ (ఉజ్బెకిస్థాన్) 6.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.**

